సాక్షి చిత్తూరు

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025

న్యూస్‌రీల్

నాగమల్లేశ్వర స్వామి సేవలో పెద్దిరెడ్డి



పూజలకు హాజరైన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం : మండలంలోని ఎర్రాతివారిపల్లె కోట మలై అయ్యప్పస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు శివరాత్రి సందర్భంగా బుధవారం సందర్శించారు. ఆలయంలోని వినాయక, ఆంజనేయ, నాగమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌ రెడ్డి, నిహంత్‌ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌ రెడ్డి, ఎంపీపీ ధనుంజయరెడ్డి, పార్టీ మండల కన్వీనర్‌ రెడ్డెప్ప రెడ్డి, ఐటీ వింగ్‌ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌ రెడ్డి, నాయకులు మనోహర్‌ రెడ్డి, శివారెడ్డి, ఇందాద్‌, తేజరెడ్డి పాల్గొన్నారు.

రూ.1.05 కోట్ల విద్యుత్‌ బిల్లుల చెల్లింపు

చిత్తూరు కార్పొరేషన్‌ : ఉమ్మడి జిల్లాలో శివరాత్రి ప్రభుత్వ సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్‌ బిల్లుల చెల్లింపు కేంద్రాలను తెరిచారు. దీంతో మొత్తం 4,800 మంది వినియోగదారులు బిల్లులు చెల్లించారని చిత్తూరు, తిరుపతి జిల్లాల ట్రాన్స్‌కో ఎస్‌ఈలు ఇస్మాయిల్‌ అహ్మద్‌, సురేంద్రనాయుడు తెలిపారు. వీటి ద్వారా రూ.1.05 కోట్ల బిల్లుల చెల్లింపు అయిందని వివరించారు.

క్యాన్సర్‌ బాధితుడికి పీఎం సహాయ నిధి

రొంపిచెర్ల : రొంపిచెర్ల మండలం మద్దిపట్లవారిపల్లెలో క్యాన్సర్‌ వ్యాధితో బాధపడుతున్న దుర్గాప్రసాద్‌నాయుడుకు ప్రధానమంత్రి సహాయ నిధి కింద రూ.3 లక్షలను రాజంపేట ఎంపీ వెంకట మిధున్‌రెడ్డి మంజూరు చేయించారు. మద్దిపట్లవారిపల్లెకు చెందిన మునిరత్నం నాయుడు కుమారుడు దుర్గాప్రసాద్‌ నాయుడు(26) క్యాన్సర్‌ వ్యాధితో బాధ పడుతున్నారని ఎంపీ దృష్టికి రెండు నెలల కిందట తీసుకెళ్లారు. దీంతో ఆర్థిక సాయం మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీని కోరారు. దీంతో పీఎం సహాయ నిధి కింద రూ. 3 లక్షలను మంజూరు చేయించారు. అడిగిన వెంటనే పీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేయించడంపై బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్యాయాన్ని ప్రశ్నిస్తే కేసులా?

- తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్‌ కేసులు తప్పవు
- జీడీనెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి మండిపాటు



కృపాలక్ష్మి, జీడీ నెల్లూరు ఇన్‌చార్జి

కార్వేటినగరం : కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరిస్తే మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి భయపడి పోతారనుకోవడం అవివేకమని గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఆ పార్టీ ఇన్‌చార్జి కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె సాక్షితో మాట్లాడుతూ.. ఎల్లో మీడియాలో తన తండ్రి ఏదో స్కాంలో చిక్కుకుని జర్మనీకి వెళ్లిపోయినట్లు అసత్యాలను వండి వారుస్తున్నారని, అలాంటి వాటిపై క్రిమినల్‌ కేసులు పెడతానని హెచ్చరించారు. మా నాన్న కుమార్తె ఇంటికి వెళ్లడంపై భయపడి పారిపోయాడని అబద్ధాలు ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. కళత్తూరు కుటుంబం కష్టపడి రాజకీయంగా ఎదిగిందని, స్కాంలు, అక్రమాలు చేసి రాలేదని హెచ్చరించారు. తన తండ్రిపై పనిగట్టుకుని ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని వారికి త్వరలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిపై తప్పుడు ప్రచారం చేసిన చానళ్లు ఆయనకు వెంటనే బహిరంగంగా క్షమాణ చెప్పాలని లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

నిరుద్యోగులకు 'జాబ్‌ ఎక్స్‌' పోర్టల్‌

చిత్తూరు కలెక్టరేట్‌ : జిల్లాలోని నిరుద్యోగులకు జాబ్‌ ఎక్స్‌ పోర్టల్‌ ఎంతో ఉపయోగకరమని జిల్లా ప్రాజెక్ట్‌ మానిటరింగ్‌ యూనిట్‌ ఆఫీసర్‌ గాంధీరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మిట్టూరులోని శ్రీ టెక్నాలజీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నేషనల్‌ స్కిల్‌ హబ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ సూచనల మేరకు జిల్లా ప్రాజెక్ట్‌ మానిటరింగ్‌ యూనిట్‌ నిరుద్యోగ యువతకు అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఎన్‌ఎస్‌డీసీ జాబ్‌ ఎక్స్‌ పోర్టల్‌తో కలిగే లాభాలను నిరుద్యోగులు తెలుసుకోవాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు ఆ పోర్టల్‌ లో రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌ చేసుకోవడం వల్ల నిరుద్యోగుల అర్హతలకు తగ్గ ఉద్యోగాలను సాధించేందుకు వీలవుతుందన్నారు. పోర్టల్‌ లో అన్ని కంపెనీలు రిజిస్టర్‌ కావడంతో నిరుద్యోగులకు సులువుగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఏవైనా సందేహాలకు 99592 36172 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నిరుద్యోగులు పాల్గొన్నారు.

భజేహం.. భవోహం



హర హర మహాదేవ.. శంభో శంకర.. నమో పార్వతీపతయే నమః.. ముక్కంటీశా పాహిమాం.. పరమేశ్వరా రక్షమాం.. ఓం నమఃశ్శివాయ అంటూ ఆదిదేవుని స్మరిస్తూ భక్తులు తన్మయత్వం చెందారు. మహిమాన్విత వాయులింగేశ్వరుని దివ్యతేజస్సును వీక్షించి పులకించారు. ఆదిమధ్యాంత రహితుని ఆత్మలింగ దర్శనంతో పునీతులయ్యారు. నిజరూపంతో సాక్షాత్కరించిన నీలకంఠుని సేవించుకుని తరించారు. ఇంద్ర విమానంపై ఊరేగుతున్న కైలాసనాథునికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. అత్యంత ప్రీతిపాత్రమై నంది వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తున్న లయకారుని మనసారా స్తుతిస్తూ పరవశించారు. పవిత్ర లింగోద్భవ కాలంలో త్రినేత్రుని తేజోవిరాజిత మూర్తిని దర్శించుకుని కోటి జన్మల పుణ్యఫలం పొందారు.

- శ్రీకాళహస్తిలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- ముక్కంటి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు
- విశిష్ట వాహనాలపై ఊరేగిన ఆదిదంపతులు
- శివనామస్మరణతో మార్మోగిన దక్షిణ కైలాసం



ఇంద్ర విమానం, చప్పరంపై ఊరేగుతున్న ఆదిదంపతులు (ఇన్‌సెట్‌) ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం శ్రీకాళహస్తి క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. వాయులింగేశ్వరుడు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ఉదయం ప్రథమ, ద్వితీయ కాలాభిషేకాలు జరిపించారు. అలాగే ఉచ్ఛికాలాభిషేకం, సాయంత్రం ప్రదోష కాలాభిషేకం చేపట్టారు. పర్వదినం సందర్భంగా మొత్తం 9 విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈక్రమంలోనే మహాశివరాత్రిని పురస్కరించుకుని వేకువజామున 2గంటలకే మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఆలయ అర్చకులు పవిత్ర మంత్రోచ్చారణ చేస్తూ స్వామి, అమ్మవార్లను మేల్కొలిపారు. అనంతరం గోపూజ చేశారు. 3 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఉదయం 5 నుంచి 10.30 గంటల మధ్య స్వామి అమ్మవార్లకు అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు.

ఇబ్బందులు లేకుండా..

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహాలఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు సులభతరంగా స్వామి, అమ్మవార్లను సేవించుకునే వెసులుబాటు ఏర్పడింది. క్యూలను విభజించి పకడ్బందీగా నిర్వహించడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తనివితీరు ముక్కంటీశుని దర్శించుకునే అవకాశం కలిగింది. ఈ మేరకు సుమారు 1.5లక్షల మంది భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ ఎక్కడా అవాంఛనీయ ఘటనలు తలెత్తలేదని వివరించారు.

ఇంద్ర విమానంపై ముక్కంటి రాజసం

మహాశివరాత్రి పర్వదినాన శ్రీకాళహస్తీశ్వరస్వామి ఇంద్రవిమానంపై పురవీధుల్లో ఊరేగారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చప్పరంపై కొలువుదీరి అనుసరించారు. మూషిక వాహనంపై వినాయకుడు, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాలపై ఊరేగింపులో ముందుకు సాగారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులతో నాలుగు మాడవీధులు కిక్కిరిసిపోయాయి. కళాకారులు పలు కళారూపాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

నేడు రథోత్సవం, తెప్పోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు మహోత్సవం ప్రారంభించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశఋరు. అలాగే రాత్రి నారద పుష్కరణిలో శివపార్వతులు తెప్పలపై విహరించనున్నారు. ఈ మమేరకు పుష్కరణిని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు.

కనులపండువగా నంది సేవ





నంది, సింహ వాహనాలపై ఊరేగుతున్న ఆది దంపతులు

వాయులింగ స్వరూపుడైన శ్రీకాళహస్తీశ్వర స్వామివారు బుధవారం రాత్రి నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వర్ణాభరణాలంకరణలో దేదీప్యంగా ప్రకాశిస్తూ జ్ఞానప్రసూనాంబ అమ్మవారు సింహవాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. నంది సేవలో కేరళ పంచ వాయిద్యాలు, భక్తి సంకీర్తనలు, భజనలు, కోలాటాలు అలరించాయి.

ముక్కంటి సేవలో 'కన్నప్ప' బృందం



మోహన్‌బాబు, మంచు విష్ణు, ప్రభుదేవా తదితరులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కన్నప్ప చిత్ర బృందం జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంచు మోహన్‌బాబు, మంచు విష్ణు, ప్రభుదేవా, శివబాలాజీ తదితరులు దక్షిణామూర్తి సన్నిధి వద్ద కన్నప్ప బుక్‌లెట్‌ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంజీఎం అధినేత గుడ్లూరు మల్లికార్జుననాయుడు, డైరెక్టర్‌ మయూర్‌ పాల్గొన్నారు.

కిక్కిరిసిన దక్షిణ కైలాసం



ముక్కంటి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దక్షిణ కైలాసానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ మేరకు శ్రీకాళహస్తి వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే ఆదిదంపతుల దర్శనానికి భక్తులు బారులుతీరారు. రాజగోపురం సమీపం నుంచి ఉచిత దర్శనానికి క్యూలు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో మహా లఘుదర్శనం అమలు చేశారు. ప్రత్యేక దర్శనం కోసం మరోగోపురం నుంచి భక్తులను అనుమతించారు. ఆలయం నుంచి బయటకు వెళ్లేందుకు స్ఫటిక లింగం పక్కనుంచి ప్రత్యేక మార్గం ఏర్పాటు చేశారు.

సామాన్య భక్తుల ఇక్కట్లు

ముక్కంటి దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలను చూసి కంగారు పడ్డారు. సామాన్య భక్తులకు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఎమర్జెన్సీ దారులు లేకపోవడంతో గంటలు తరబడి వేచి ఉన్న మహిళలు బాత్‌రూమ్‌కు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. దాదాపు 1.5 లక్షల మంది వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేసినా, అర్ధరాత్రి వరకు 60 వేల మంది భక్తులు మాత్రమే స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడం గమనార్హం. అయినప్పటికీ చిన్నపాటి తోపులాటలు, భక్తులు అధికారుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకోవడంతో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. మదర్‌ ఫీడింగ్‌ కోసం ఎటువంటి ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

ట్రాఫిక్‌ కష్టాలు

వాహనాలను వంతెనకు అవతలే నిలిపేశారు. అయినప్పటికీ ప్రోటోకాల్‌ పేరుతో వీఐపీల వాహనాలు ఆలయ నాలుగో గేటు వరకు వచ్చాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్‌ కష్టాలు ఏర్పడ్డాయి.

అలంకరణపై విమర్శలు

గతంలో మహాశివరాత్రి రోజున పండ్ల ,పూలతో ఆలయంలో అలంకరణ చేసేవారు. అయితే ప్రస్తుతం పూలతో మాత్రమే డెకరేషన్‌ చేశారు. అవి కూడా వాడిపోయి ఉండడంతో భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి.

తమ్ముళ్ల చేతులమీదుగా ప్రసాదాలు

ఆలయం తరఫున పసుపు, కుంకుమతోపాటు ప్రసాదాలను పంపిణీ చేశారు. అయితే టీడీపీ నేతల చేతులమీదుగా భక్తులకు అందించడం సరికాదని పలువురు మండిపడ్డారు.



ముక్కంటి సన్నిధిలో అలంకరణ



ప్రసాద వితరణ చేస్తున్న మహిళలు



ఆలయంలో విశేషాలంకరణ

అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే అబద్ధాలు

- వైఎస్సార్‌సీపీ చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి ఆగ్రహం

చిత్తూరు కార్పొరేషన్‌ : ప్రజాసమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌నాయుడు అబద్ధపు మాటలు వల్లెవేశారని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చిత్తూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'మా నాయకుడు జగనన్నపై వ్యంగాస్త్రాలు వేసే స్థాయి గురజాలది కాదన్నారు. ప్రతిపక్ష హోదాపై గవర్నర్‌ను బెదిరిస్తున్నామంటున్నారు.. గతంలో బీజేపీకి 3 సీట్లు వస్తే ఢిల్లీలో ప్రతిపక్ష హోదా ఇవ్వలేదా..? అని ప్రశ్నించారు. అదృష్టం కలిసొచ్చి, ఈవీఎంల మాయతో ఎమ్మెల్యేగా గెలిచిన గురజాలకు ప్రజా సమస్యలపై ఏమాత్రం అవగాహన లేదన్నారు. కూటమి పాలనలో జిల్లా మొత్తానికి కలిపి 36 ఆర్టీసీ బస్సులు వస్తే.. ఇందులో చిత్తూరుకు మాత్రం నాలుగు బస్సులు వచ్చాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఒక్క చిత్తూరుకే 21 బస్సులు తెచ్చినట్లు గుర్తు చేశారు. ఇప్పుడొచ్చిన 36 బస్సులు కూడా తమ ప్రభుత్వ హయంలో మంజూరు చేసినవేనని స్పష్టం చేశారు. గతేడాది ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు అంటూ చిత్తూరులో ప్రచారం చేసుకున్న గురజాల ఇప్పటికీ దాన్ని ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని విజయానందరెడ్డి నిలదీశారు.



మాట్లాడుతున్న విజయానందరెడ్డి, పార్టీ నేతలు

ఆ మద్యం బ్రాండ్లు మీవే..

ప్రెసిడెంట్‌ మెడల్‌, గవర్నర్‌ రిజర్వ్‌, బూమ్‌బూమ్‌ లాంటి మద్యం బ్రాండ్లు టీడీపీ పాలనలో వచ్చినేవని.. వీటి అనుమతులు కూడా టీడీపీనే ఇచ్చిందన్నారు. మద్యం అక్రమ కేసుల్లో తమ పార్టీ ముఖ్యనేతలు పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి, నారాయణ స్వామి పేర్లు చెప్పాలని ఎక్సైజ్‌ ఉన్నతాధికారులు వాసుదేవ రెడ్డి, సత్యప్రసాద్‌కు కూటమి నేతలు వేధించడం నిజం కాదా అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి జర్మనీలో ఉన్న కుమార్తె వద్దకు వెలితే, మాజీ మంత్రి విదేశాలకు పారిపోయారని ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్‌ చంద్రశేఖర్‌, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్‌, గుడిపాల అధ్యక్షుడు ప్రకాష్‌, నాయకులు గాయత్రీదేవి, జ్ఞానజగదీష్‌, రజనీకాంత్‌, అంజలిరెడ్డి, ముత్తు, శేఖర్‌, హరీషారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, స్టాన్లీ పాల్గొన్నారు.

జీడీ నెల్లూరులో డీపీఆర్సీ శిక్షణ భవనం

- రూ.2 కోట్ల నిధులు విడుదల
- 8 వేల అడుగులలో నిర్మాణం

చిత్తూరు కార్పొరేషన్‌ : జీడీ నెల్లూరులో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం (డీపీఆర్సీ) శిక్షణ కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి శాఖాపరంగా అనుమతులు వచ్చాయి. స్థలం ఎంపిక, నిధులు విడుదల పూర్తయింది. డీపీఆర్సీ కార్యాలయం ప్రస్తుతం జెడ్పీలో ఉంది. జిల్లాలోని పలు పథకాలు, అంశాల మీద సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. మండలాలు లేదా జెడ్పీ కార్యాలయం, లేదా అద్దె భవనాలు తీసుకొని శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నారు. ఇది వ్యయంగా మారడంతో కొత్త భవనం కోసం నివేదిక పెట్టారు. గతంలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలకు ఎక్కువగా శ్రీకాళహస్తిలోని ఎక్స్‌టెన్షన్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ (ఈటీసీ)లో నిర్వహించేవారు. జిల్లాల విభజన తర్వాత చిత్తూరులో పెట్టాలని ప్రతిపాదన పెట్టారు. తర్వాత చిత్తూరు, జీడీ నెల్లూరు ప్రాంతాలను మొదట ఎంపిక చేసి స్థలాన్వేషణ చేశారు. చివరిగా జీడీ నెల్లూరులో ఏర్పాటుకు స్థలం దొరికింది. 8 వేల చదరపు అడుగులతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. వీటి నిర్మాణం కోసం రూ.2 కోట్లు నిధులు విడుదల అయ్యాయి. సంబంధిత పనులకు సంబంధించి టెండర్లను పిలవనున్నట్లు పీఆర్‌ ఎస్‌ఈ చంద్రశేఖర్‌ రెడ్డి పేర్కొన్నారు. ఇందులో సమావేశ మందిరం, డీపీఆర్సీ కార్యాలయం, హాలు, డైనింగ్‌హాలు, కిచెన్‌, స్టోర్‌ రూమ్‌, స్త్రీ, పురుషుల విశ్రాంతి గది, టాయిలెట్స్‌ను నిర్మించనున్నారు.



క్లుప్తంగా

బతుకు భారమై వృద్ధుడు..

బైరెడ్డిపల్లి : వృద్ధాప్యం మీద పడటంతో పాటు బతుకు భారమై జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కొత్తయిండ్లు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుర్రప్ప (70)కు భార్య, కుమారులు పదేళ్ల కిందట మృతి చెందారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశాడు. దీంతో ఒంటరిగా ఉన్న గుర్రప్పకు జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో రెండు రోజుల కిందట గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం గ్రామస్తులు గమనించి కుమార్తెలకు సమాచారం అందించారు. దీంతో కుమార్తె నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జగన్నాథగౌడుకు దాతల చేయూత

- వైద్య ఖర్చులకు సాయం



జగన్నాథగౌడు కుటుంబ సభ్యులకు రూ.15 వేల నగదు అందజేస్తున్న కనకదాస సేవాసమితి నిర్వాహకులు

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు : బైరెడ్డిపల్లి మండలం రామనపల్లికి చెందిన జగన్నాథగౌడుకు మెరుగైన వైద్యం కోసం పలమనేరుకు చెందిన కనకదాస సేవా సమితి తరపున కురుబ కులస్తులు రూ.16 వేల ఆర్థిక సాయాన్ని రోగి కుటుంబికులకు బుధవారం పట్టణంలో అందజేశారు. దీంతో సాయం చేసిన సుబ్రమణ్యం గౌడు, ఈశ్వర్, సోము, గోపాల్‌గౌడు, నారాయణ, దొరస్వామి తదితరులు బాధితుడి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. తన బిడ్డను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు డబ్బులేదని తల్లి లక్షుమమ్మ ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయ్యానా బిడ్డను కాపాడండి! అనే శీర్షికన గత శనివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం అయింది. దీనిపై స్పందించిన జిల్లా అధికారుల ఆదేశాలతో ఆ మండలం వైద్యాధికారి విజయచంద్ర రోగిని చికిత్స కోసం చిత్తూరు ఆస్పత్రికి తరలించి హెచ్‌బీ లెవెల్స్‌ను మెరుగు చేశారు. మరింత మెరుగైన వైద్య చికిత్స కోసం దాతలు ముందుకొచ్చి సాయం చేశారు. సాక్షి చూపిన సామాజిక బాధ్యతను స్థానికులు కొనియాడారు.

కంటైనర్‌లో మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గుడిపాల : కంటైనర్‌లో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం వేలూరు నుంచి ఢిల్లీకి కంటైనర్ స్క్రాబ్ (వేస్టేజ్)ను తీసుకెళ్తోంది. గుడిపాల మండలంలోని గొల్లమడుగు వద్ద ఉన్నట్టుండి లారీలో నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే కొంత మేర నష్టం వాటిల్లింది. వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



అన్నదాతకు సున్నం..
పెట్టుబడి శూన్యం

కూటమి సర్కారు 'అన్నదాత సుఖీభవ' అని పేరు పెట్టి.. రైతన్న నోట్లో మట్టి కొట్టింది. ఇప్పటికే ఖరీఫ్, రబీ పంట కాలం ముగిసినా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదు.. రైతులపై కనికరం చూపడం లేదు. పంటల సాగుకు పెట్టుబడి సాయం అందజేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీలు గుప్పించారు. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెట్టుబడి సాయం ఊసే లేకపోవడంపై బాబు చేతిలో మరోసారి మోససోయామని అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

- రైతాంగాన్ని నిలువెల్లా మోసం చేసిన కూటమి సర్కారు
- పెట్టుబడి సాయం ఇవ్వకుండా కాలయాపన
- రబీ, ఖరీఫ్‌లో చిల్లిగవ్వ విదల్చని వైనం
- ఇప్పటికే మూడు విడతల సాయం అందజేసిన కేంద్రం
- రైతుకు దక్కని భరోసా

చిత్తూరు అర్బన్: అన్నదాత సుఖీభవ.. పేరు ఎక్కడో విన్నట్టుందనుకుంటున్నారా..! కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతు పంట సాగు చేసుకోవడానికి పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తామని.. దానికి అన్నదాత సుఖీభవగా నామకరణం చేస్తున్నట్లు ఎన్నికలకు ముందు కూటమి నేతలు సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీ పేరు ఇది. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలల్లో రెండు సీజన్లు ముగిసిపోతున్నా.. రైతులకు ఒక్క రూపాయి పెట్టుబడి సాయం అందలేదు.

సాగు భారం

గత ఏడాది జూన్‌లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటికే జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యింది. జిల్లాలోని 36 మండలాల్లో ఖరీఫ్‌లో 81,169 హెక్టార్లలో వేరుశనగ, కంది, రాగి, ఉలవలు, సజ్జలు ఇతర పంటలు సాగు చేయాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం దగా చేసి, అన్నదాతకు అండగా నిలబడకపోవడంతో కేవలం 33,920 హెక్టార్లలో మాత్రమే పంటల సాగుకు పరిమితమయింది. ఇక నాలుగు నెలల క్రితం ప్రారంభమైన రబీ సీజన్.. మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. ఈ రబీలో జిల్లాలో 23,387 హెక్టార్ల వరకు వరి, మిరప, రాగి, ఉలవలు, వేరుశనగ, చెరకు లాంటి ప్రధాన పంటల సాగు చేయాల్సి ఉంటే.. సీజన్ ముగుస్తున్న వేళ 18,017 హెక్టార్లలో అన్ని రకాల పంటలు సాగు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నైరుతి రుతుపవనాల్లో జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడక.. రైతులకు కన్నీళ్లను మిగిల్చింది. రబీలోనైనా ప్రభుత్వం పంటలు వేసుకోవడానికి పెట్టుబడి సాయం ఇస్తారని కోటి ఆశలతో ఎదురు చూసిన హాలికులకు ఈ సీజన్‌లోనూ నిరాశే మిగిలింది.

రూ.886 కోట్లు అందించిన గత ప్రభుత్వం

ఇచ్చిన మాటకు కట్టుబడడమే ధ్యేయంగా గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే రైతులకు రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తూ వచ్చింది. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులు కష్టనష్టాల్లో ఉంటే నాటి సీఎం వైఎస్ జగన్ అండగా నిలబడ్డారు. ఏటా క్రమం తప్పకుండా జూన్, అక్టోబర్, జనవరి నెలల్లో ప్రతి రైతుకు పీఎం కిసాన్‌తో కలిపి రూ.13,500 ప్రకారం జమ చేశారు. కౌలు రైతులు, దేవదాయ, అటవీ భూమి సాగుదారులకు కేంద్రంతో సంబంధం లేకుండా పూర్తి స్థాయి పెట్టుబడి సాయం అందించారు. జిల్లాలోని రైతాంగానికి ఆయన సీఎంగా ఉన్న అయిదేళ్లల్లో పెట్టుబడి సాయంగా ఏకంగా రూ.886.31 కోట్లు అందించి అన్నదాతలకు అండగా నిలిచారు.

కేంద్ర సాయం సంపూర్ణం

కూటమి ప్రభుత్వంతో పాటు అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని మోదీ సర్కారు రైతులకు ఇవ్వాల్సిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నుంచి జమ కావాల్సి రూ.6 వేలను మూడు విడతలుగా చెల్లించేసింది. సోమవారం మూడో విడతగా 1,80,184 మందికి రూ.2 వేలు చొప్పున రూ.36.03 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో కేంద్ర సాయం సంపూర్ణంగా అందినట్లయ్యింది. కానీ ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఖరీఫ్, రబీ సీజన్లు వెళ్లిపోతున్నా.. అదిగో, ఇదిగో అంటూ అన్నదాతను దుఃఖపెట్టడమే ధ్యేయంగా పెట్టుకుంటూ ఏమారుస్తోంది.

రూ.252 కోట్ల బకాయి

జిల్లాలో దాదాపు రెండు లక్షల మంది రైతులకు రూ.280 కోట్లకు పైనే పెట్టుబడి సాయం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం బకాయి పడింది. కొందరు రైతులు అసలు పంట జోలికే వెళ్లకపోగా.. మరి కొందరు పంట వేసుకోవడానికి పెట్టుబడుల కోసం చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం, ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం అందకపోవడంతో వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు.

రంజాన్‌కు మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మసీదుల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలోని మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. నగరం, పట్టణాలు, గ్రామాల్లో మసీదుల వద్ద పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. తెల్లవారుజామున ముస్లింలు మసీదులకు వెళ్లి నమాజ్ చేసుకుంటారని ఆ సమయంలో విద్యుత్ సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

జాతీయ సైన్స్‌డే పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 28న జాతీయ సైన్స్ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ పోటీల నిర్వహణకు జిల్లాకు రూ.50 వేలు మంజూరు చేశారు. వికసిత్ భారత్ కోసం ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారత కల్పించడం అనే అంశంపై విద్యార్థులకు క్విజ్, సెమినార్‌లు నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే
ఆలయాలకు పూర్వవైభవం




నెక్కుందిలో భక్తులకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు : పురాతన ఆలయాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగిందని, కోట్ల రూపాయలు ఖర్చుచేసి ఆలయాలకు పూర్వవైభవం తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని నెక్కుందిలోని శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. నెక్కుంది సోమల మండలంలోని దుర్గంకొండలో, చౌడేపల్లె మండలంలో బోయకొండ, మృత్యుంజయేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయం, దేవళంపేటలోని పురాతన ఆలయాలకు కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసి ఆలయాలకు పూర్వవైభవం తీసుకురావడం జరిగిందన్నారు. అలాగే దేవళంపేట, పుంగనూరులోని శ్రీ వేంకటేశ్వర స్వామి, చౌడేపల్లె మండలంలోని రాజనాల బండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయాలను టీటీడీ పరిధిలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట అనీషారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రెడ్డెమ్మ, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి పాల్గొన్నారు.

మొగిలీశ్వరా నమోనమః

- కిక్కిరిసిన మొగిలి క్షేత్రం



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు, (ఇన్‌సెట్) అలంకరణలో మొగిలీశ్వరస్వామి

బంగారుపాళెం : హరహర మహాదేవ శంభోశంకర అంటూ.. మొగిలి క్షేత్రం శివనామ స్మరణతో మారుమోగింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం మొగిలీశ్వరున్ని దర్శించుకునేందుకు భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఉదయం స్వయంభు శ్రీ మొగిలీశ్వరసామి, కామాక్షమ్మ వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు కర్ణాటక, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు మొగిలీశ్వరాలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు భక్తులతో బారులు తీరాయి. పలమనేరు, చిత్తూరు డిపోల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్ సర్వీసులను నడిపారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం అనంతరం స్వామి, అమ్మవారు వృషభ వాహనంపై విహరించారు. జిల్లా ఎస్పీ మణికంఠచందోలుతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. రఘు కుటుంబ సభ్యులు చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలు పాల్గొని భక్తులకు అన్నదాన ప్రసాదాలు పంపిణీ చేశారు. పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ పర్యవేక్షణలో బంగారుపాళెం సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

దేవరకొండపై..: మొగిలి శివాలయానికి అనుబంధ ఆలయమైన దేవరకొండపై బుధవారం మహాశివరాత్రి సందర్భంగా జలకంఠేశ్వరాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



అన్నదాన కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలు

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామికి కాణిపాక ఆలయం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాక వినాయక స్వామి ఆలయ ఈఓ పెంచల కిషోర్ పట్టు వస్త్రాలను ఆలయ అధికారులకు అందజేశారు.

నేడు రావణబ్రహ్మవాహనం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం అభిషేకం కైలాసగిరి రావణ బ్రహ్మ వాహనం, రాత్రి శేషవాహన సేవలను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి అనుమానాస్పద మృతి

చిత్తూరు అర్బన్ : చిత్తూరులో కనిపించకుండా పోయిన ఓ వ్యక్తి శవమై కనిపించాడు. టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు చిత్తూరు నగరంలోని పోతంబట్టుకు చెందిన చంద్రశేఖరెడ్డి (60) ఈనెల 17వ తేదీన అదృశ్యమయ్యాడు. రాత్రి ఇంటికి రాకపోయే సరికి కుటుంబీకులు పలుచోట్ల గాలించారు. ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం పోతంపట్టు నీవానది ఒడ్డున ఓ మృతదేహం ఉన్నట్లు స్థానికుల నుంచి సమాచారం అందింది. దీంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడు కుమారుడు భరత్‌రెడ్డితో శవం చంద్రశేఖర్‌రెడ్డిదేనని నిర్ధారించారు. కాగా అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి చేపలు పట్టడం, అడవి పందులు వేటాడే అలవాటు ఉందని, ఈ క్రమంలో కరెంటు వైర్లు తగిలి చనిపోయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

వృద్ధురాలి బలవన్మరణం

చిత్తూరు అర్బన్ : నడుము, కడుపు నొప్పి తాళలేక ఓ వృద్ధురాలు బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. తాలూకా ఎస్‌ఐ మల్లికార్జున వివరాల మేరకు చిత్తూరు నగరం వైఎస్సార్ జ్ఞానమణి (65)కొన్నాళ్లుగా కడుపు, నడుము నొప్పితో బాధపడుతుండేది. ఈ నొప్పులు తాళలేక బతుకుపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించింది. ఈక్రమంలో ఇంట్లోనే ఊయలకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

అక్రమ వ్యాపారాలపై చర్యలు

చిత్తూరు కార్పొరేషన్ : తుక్కు అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతామని సీటీ(వాణిజ్య పన్నుల)శాఖ జేసీ (సంయుక్త కమిషనర్) జాన్ స్టీవెన్‌సన్ బుధవారం తెలిపారు. దీనికి సంబంధించి అధికారులు చర్యలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా గతంలో మొత్తం 13 వ్యాపార సంస్థల రిజిస్ట్రేషన్లను రద్దు చేసిన విషయం తెలిసిందేనన్నారు. మరికొన్ని వ్యాపార సంస్థలను తనిఖీ చేసి భారీ మొత్తంలో జరిమానా విధించామన్నారు. రద్దయిన 13 సంస్థలకు సంబంధించిన అక్రమ రవాణాకు సూత్రధారిగా అనుమానిస్తున్న కట్టమంచిలోని వ్యాపార సంస్థపై మంగళవారం రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిత్తూరు ఏసీ-1 శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారన్నారు. ఆ సంస్థ కార్యాలయంలో పత్రాలను, రికార్డులను స్వాధీనం చేసుకున్నారన్నారు. వాటిని పరిశీలించిన అనంతరం అక్రమ లావాదేవీలకు సంబంధించి కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

కట్టుదిట్టంగా సీఎం భద్రతా ఏర్పాట్లు



సభా స్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

గంగాధర నెల్లూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్చినెల 1న చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా జీడి నెల్లూరు మండలంలో పింఛన్ల పంపిణీ నేపథ్యంలో మంగళవారం జీడి నెల్లూరు హరిజన వాడ, సభావేదిక, హెలిప్యాడ్ ఏర్పాట్లకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ సుమిత్ కుమార్, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పి.వెంకటేష్, స్థానిక ఎమ్మెల్యే థామస్‌తో కలసి పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, కాన్వాయ్ నిర్వహణ, ప్రజా వేదిక, పింఛన్ల పంపిణీకి లబ్ధిదారుల ఎంపిక సంబంధిత అంశాలపై సమన్వయకర్తతో కలెక్టర్, ఎస్పీ చర్చించారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ట్రాన్స్‌కో ఈఈ నాగరాజు , డీఈ సురేష్, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

పలమనేరులో ఐహెచ్‌పీ ల్యాబ్

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇక్కడే ఏర్పాటు



ఐహెచ్‌పీ ల్యాబ్ పనులు ప్రారంభమైన పలమనేరు ఏరియా ఆస్పత్రి

పలమనేరు : పలమనేరు ఏరియా ఆస్పత్రిని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధునీకరించింది. ఇప్పుడున్న సౌకర్యాలు, సువిశాలమైన ఆస్పత్రి ప్రాంగణాన్ని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో మంజూరైన అయిదు ఐహెచ్‌ఎఫ్ ల్యాబ్‌లో ఒక ల్యాబ్‌ను పలమనేరుకు కేటాయించారు. ఇంటర్నల్ హెమరాజిక్ ఫ్యాసిమెనిన్ జియోసిస్ అని పిలవబడే ఈ ల్యాబ్‌ను రూ.40 లక్షల నాబార్డు నిధులతో ఇక్కడి ఆస్పత్రిలోని నాలుగు గదుల్లో పనులు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించిన పనుల పురోగతిని స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి బుధవారం ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, వైద్యులు, ఆస్పత్రి సలహా మండలి సభ్యులతో కలసి చర్చించారు. అన్ని రకాల వైరల్ టెస్టులతో పాటు బయాప్సీ పరీక్షలు కూడా ఈ ల్యాబ్‌లో చేయనున్నారు. బయాప్సీ టెస్టల కోసం ఇప్పటి దాకా ముంబై, చెన్నై, పూణె లాంటి ల్యాబ్‌లకు పంపేవారు. ఈ నివేదికలు నెలల తర్వాతగాని అందేవి కాదు. గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఏపీలో నాలుగు ఏరియా ఆస్పత్రులను ఎంపిక చేసింది. ఇందులో పలమనేరు ఒకటి. ల్యాబ్ ఏర్పాటైతే ఇందులో వైరాలజిస్టులు, పాథాలజిస్టులు, అవసరమైన సిబ్బంది, పరికరాలు అందుబాటులోకి రానున్నాయి.

విద్యార్థుల జీవితాలతో ఆటలు

విద్యార్థులు చదివింది తిరుపతి జిల్లాలో.. పరీక్షలు రాయబోయేది చిత్తూరు జిల్లాలో ఇదేమి వింత ధోరణి అని విద్యార్థి సంఘాలు మండి పడుతున్నాయి. మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు తిరుపతి జిల్లాకు చెందిన 84 మంది విద్యార్థులు చిత్తూరు జిల్లా కేంద్రానికి విచ్చేసి పరీక్షలు రాయనున్నారు. విద్యావ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన కూటమి అలసత్వంతో ఇలాంటి అవస్థలు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు, విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- తిరుపతి విద్యార్థులకు చిత్తూరులో పరీక్ష
- కూటమి పాలనలో ఇంటర్ విద్యార్థులకు వింత అనుభవం
- ప్రైవేట్ కళాశాల నిర్వాహకంతో విద్యార్థుల అవస్థలు
- అనుమతి లేని కళాశాలల నిర్వహణతోనే ఈ పరిస్థితి



చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ అధికారుల నుంచి అనుమతి లేకుండా తిరుపతి జిల్లా బైరాగి పట్టెడలో ఎస్‌ఎస్‌ఆర్ అనే కళాశాల 2024–2025 విద్యాసంవత్సరంలో నిర్వహించారు. తిరుపతిలో కళాశాల నిర్వహిస్తున్న నిర్వాహకుడు ఓంప్రకాష్ చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన ఎస్వీ కళాశాల కరస్పాండెంట్ నుంచి కళాశాలను కొనుగోలు చేసుకున్నారు. కొనుగోలు చేసుకున్న తిరుపతి నిర్వాహకుడు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అన్ని అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అయితే అలా తీసుకోకుండా ప్రస్తుత విద్యాసంవత్సరం అంతా తిరుపతిలో కళాశాలను నిర్వహించారు. ఈ వ్యవహారం పలుమార్లు అక్కడి విద్యార్థి సంఘాలు తిరుపతి ఇంటర్మీడియట్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఆ తర్వాత తిరుపతి ఎస్‌ఎస్‌ఆర్ కళాశాలను సందర్శించిన ఇంటర్మీడియట్ అధికారులు అప్పట్లోనే కళాశాలను సీజ్ చేసి ఉంటే ఎలాంటి సమస్యలు ఉండేవి కావు. అలా చేయకుండా ఎస్‌ఎస్‌ఆర్ కళాశాల నిర్వాహకుడికి అనుకూలంగా ఇంటర్మీడియట్ అధికారులు వ్యవహరించారు. ఈ సమస్య జటిలమై పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్‌లు వచ్చే సరికి 84 మంది విద్యార్థుల భవిష్యత్‌కు అంధకారంలోకి వెళ్లేలా చేసింది.

విద్యార్థులకు అగచాట్లు

ఈ వ్యవహారంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలేమో సాఫీగా ఉంటున్నాయి. చివరికి 84 మంది విద్యార్థులు మాత్రం అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇటీవల ఆ విద్యార్థుల హాల్‌టికెట్‌లు జారీ కాకపోవడంతో సమస్య తీవ్రం అయింది. చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో విచారణ నిర్వహించారు. పెనుమూరు కళాశాలకు నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత క్షుణ్ణంగా విచారణ చేసిన అనంతరం రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారులకు విచారణ నివేదికలను పంపారు. తిరుపతి జిల్లాకు చెందిన 84 మంది విద్యార్థుల వివరాలు పెనుమూరు ఎస్వీ జూనియర్ కళాశాల లాగిన్‌లోనే నమోదయ్యారు. దీంతో వారందరినీ చిత్తూరు జిల్లాలో చదివినట్లుగానే పరిగణించాల్సి వచ్చింది.

84 మంది విద్యార్థులకు చిత్తూరులోనే కేంద్రాలు..

ఈ విషయంపై రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారులు ఒక నిర్ణయానికి వచ్చి విద్యార్థులకు అన్యాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. 84 మంది విద్యార్థులకు పరీక్షలు ఎలా రాయించాలనే విషయంపై చిత్తూరు డీవీఈఓ సయ్యద్ మౌలాతో సంప్రదింపులు జరిపారు. తిరుపతి జిల్లాలో పరీక్ష కేంద్రాలు కేటాయించాలంటే ఎస్‌ఎస్‌ఆర్ కళాశాలకు అనుమతి లేదు. దీంతో విద్యార్థుల వివరాలు పెనుమూరు మండలం ఎస్వీ కళాశాల లాగిన్‌లోనే ఉండడంతో చిత్తూరు జిల్లాలోనే పరీక్ష కేంద్రాలు కేటాయించారు. పరీక్ష ఫీజుకు అదనంగా జరిమానా విధించి తత్కాల్ విధానంలో ఎస్వీ కళాశాల నిర్వాహకుడు ఫీజు చెల్లించాలని ఆదేశించారు. ఎస్వీ కళాశాల నిర్వాహకుడు జరిమానాతో 84 మంది విద్యార్థుల ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించారు. దీంతో ఆ విద్యార్థులకు చిత్తూరు జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను కేటాయించారు. చివరికి మార్చి 1వ తేదీ నుంచి తిరుపతి జిల్లా నుంచి చిత్తూరుకు వచ్చి విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వస్తోంది.

సాక్షి క్లాసిఫైడ్స్



■రాపిడో బైక్ టాక్సీ కెప్టెన్‌గా చేరండి. రోజు కు రూ.1,000/- వరకు సంపాదించండి. అవసరమైన Doc: RC, లైసెన్స్, Android మొబైల్, ఆధార్/Pan కార్డ్. 04048937617.

■ప్రముఖ కంపెనీలో Team Leaders గా తిరుపతి, చిత్తూరు జిల్లాలో పనిచేయుటకు Male /Female కావలెను. Part/Full Time, Qual: Inter above. ✆ 9440351657.

■తిరుపతిలోని ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు మహిళా టెలికాలర్స్ కావలెను. Quali:10th, Inter and Degree.ఆకర్షణీయమైన జీతం. 9100445334, 7893910695.

■ ఇంటర్‌నేషనల్ ట్రస్టెడ్ కంపెనీ నందు పనిచేయుటకు స్టూడెంట్స్, హౌస్ వైఫ్, రిటైర్డ్ ఎంప్లాయిస్ కావలెను. Age లిమిట్ 18 సం॥ పైన. సంప్ర: 9000762217

■మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/-. ఫోన్ : 80084 01243

■Wanted Bank Field Verification Executives, Tirupati town and Sullurupet and Tada. Qly: Swiggy delivery and courier experience. Cont : 90598 92362.

■కష్టపడేవారు కాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పు.ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు. ఫ్రీరూమ్+భోజనం. Hyd.ఫోన్: 9668253875

■హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక